సాక్షి
కాకినాడ
సోమవారం । 20 । నవంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళాలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అన్నదానానికి కర్రి సాయిలీల (రావులపాలెం) తొలి జీతం రూ.27,350, కర్రి నందన విశ్వనాథ్ (అమెరికా) రూ.20,232 చొప్పున విరాళాలు సమర్పించారు.



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కోకా విజయలక్ష్మీ శేషకుమారి (కాకినాడ) ఆదివారం దేవస్థానం ఛైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు ఆదివారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

లోవకు పోటెత్తిన భక్తులు



లోవ ప్రాంగణంలో వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని తలుపులమ్మ అమ్మవారిని ఎనిమిది వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ సూపరింటెండెంట్ మూర్తి తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.72,240, పూజా టికెట్లకు రూ.37,580, కేశఖండన టికెట్ల అమ్మకం ద్వారా రూ.6,520, వాహన పూజలకు రూ.4,510, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.9,950, విరాళాలుగా రూ.1,37,326 కలిపి అమ్మవారికి రూ.2,68,126 ఆదాయం సమకూరింది. కాగా, తలుపులమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, మహా మండప నిర్మాణానికి శ్రీకాకుళానికి చెందిన భక్తురాలు అయ్యపురెడ్డి ఛాయారాణి రూ.50,101 విరాళం సమర్పించారు.

సమసమాజానికి కృషి చేసిన మహనీయుడు ఆవంత్స



సమావేశంలో మాట్లాడుతున్న అరసం జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

పిఠాపురం: సమసమాజ స్థాపనకు 82 ఏళ్ల పాటు తన రచనల ద్వారా పాటుపడిన మహోన్నతుడు ఆవంత్స సోమసుందర్ అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆవంత్స సోమసుందర్ లిటరసీ ట్రస్టు ఆధ్వర్యాన పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆవంత్స శత జయంత్యుత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నిబద్ధత కలిగిన రచయితగా సమాజ మార్పు కోసం ఆవంత్స రచనలు చేశారని అన్నారు. మరో ముఖ్య అతిథి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్ మాట్లాడుతూ, మనిషిని నడిపించేది ఒకటి సైన్సు అయితే రెండోది సాహిత్యం అని అన్నారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడంలో ఆవంత్స సోమసుందర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. సాహిత్యానికి, కళలకు నేటి యువత దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరం సోమసుందర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెలికాని స్టాలిన్, పీఆర్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భరత లక్ష్మి, సహృదయ మిత్ర మండలి సభ్యులు పి.పావని, యువ రచయిత కిలారి గౌరీనాయుడు, రచయిత గౌరవ్, సోమసుందర్ లిటరసీ ట్రస్టు సభ్యులు డాక్టర్ గజరాజు సీతారామస్వామి, మేకా మన్మథరావు, ఆవంత్స విజయ శేషేంద్ర, శాతకర్ణి, గట్టి శ్రీకృష్ణదేవరాయలు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, తటవర్తి సుబ్బారావు, సాహిత్య అభిమానులు, కళాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కాకినాడలోనే.. కలర్‌ఫుల్ ప్రింటింగ్



డబుల్ డమ్మీ కొమోరి మల్టీకలర్ జపాన్ తయారీ ప్రింటింగ్ మెషీన్

- చేరువలోనే ప్రింటింగ్ క్లస్టర్
- టైర్-2 సిటీల్లో ఇక్కడే తొలిసారి
- జపాన్ టెక్నాలజీ, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు
- రూ.15 కోట్ల పెట్టుబడి
- ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అంతర్జాతీయ ప్రమాణాలతో.. కళ్లు మిరుమిట్లు గొలిపే మల్టీకలర్ ప్రింటింగ్ మనకూ అందుబాటులోకి వచ్చేస్తోంది. ఎక్కడో దూరంగా ఉన్న విజయవాడలో కానీ అందుబాటులో లేని అత్యంత ఆధునిక టెక్నాలజీ ఇకపై మన దరి చేరబోతోంది. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు, చొరవతో కాకినాడలోనే ప్రింటింగ్ క్లస్టర్ అందుబాటులోకి వచ్చేస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూతనిచ్చేలా ఈ క్లస్టర్ సిద్ధమవుతోంది. టైర్-2 (రెండో శ్రేణి) నగరాల్లో రాష్ట్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే సంకల్పంతో పారిశ్రామిక క్లస్టర్లు తీసుకు వస్తోంది. దీనిలో భాగంగా కాకినాడలో ఇప్పటికే ప్రింటింగ్ క్లస్టర్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ట్రయల్ రన్ జరుగుతోంది. మరోవైపు కాకినాడలోనే రైస్ క్లస్టర్, పాలిమర్ క్లస్టర్ కూడా సిద్ధమవుతున్నాయి. రాజమహేంద్రవరంలో ఫర్నిచర్ క్లస్టర్, మాచవరంలో డాల్ క్లస్టర్ల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ తోడ్పాటు అందిస్తోంది.

క్లస్టర్లతో ఉపాధికి ఊతం

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి సదుపాయాల కేంద్రాలను (కామన్ ఫెసిలిటీ సెంటర్లు) ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఒకేచోట అన్ని రకాల సేవలూ అందుబాటులో ఉంచడం ద్వారా ఒక్కో పనికి ఒక్కో ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయాలనేది ప్రభుత్వ సంకల్పం. ఇందుకు అనుగుణంగానే క్లస్టర్లు ఏర్పాటు చేస్తోంది. ఈ క్లస్టర్ల ఏర్పాటుకు రెండు రకాల రాయితీలు అందిస్తోంది. మొదటి కేటగిరీలో 10 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, రెండో కేటగిరీలో 20 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటి కేటగిరీ రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు, రెండో కేటగిరీ క్లస్టర్‌ను రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం దాదాపు నిర్మాణం పూర్తయిన కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్ రెండో కేటగిరీలో సుమారు రూ.15 కోట్లతో ఏర్పాటైంది. దీనిలో కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం చొప్పున రాయితీ సమకూరుస్తున్నాయి. ఈ క్లస్టర్‌లో ఒకేసారి 200 మంది ప్రింటర్లకు సరిపడా సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇంతటి భారీ స్థాయిలో ప్రింటింగ్ క్లస్టర్ రావడం జిల్లా పారిశ్రామిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని పలువురు అంటున్నారు.



4హై వెబ్ డబుల్ రీల్‌స్టాండ్ క్వార్టర్ పేజీ ఫోల్డర్ మెషీన్

తప్పనున్న దూరాభారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతో పాటు మండపేట, రామచంద్రపురం తదితర పట్టణాల్లో సుమారు 500 ప్రింటింగ్ యూనిట్లు ఉన్నాయి. అయినప్పటికీ వేల సంఖ్యలో మల్టీకలర్ డిజైనింగ్, ప్రింటింగ్, బైండింగ్, కటింగ్ వంటి భారీ ఆర్డర్లు ఉంటే ఇప్పటి వరకూ ఇక్కడి వారు దూరాన ఉన్న విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఈ ప్రాంతం వారు ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు. కాకినాడలో ప్రింటింగ్ క్లస్టర్ అందుబాటులోకి వచ్చాక ఇక్కడి వారికి విజయవాడ వెళ్లే బాధ తప్పుతుంది. ప్రింటింగ్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలూ కాకినాడలోనే లభించనున్నాయి. ఆ మేరకు వారికి వ్యయంతో పాటు సమయం కూడా కలిసి వస్తుంది.

అందుబాటులో అత్యాధునిక మెషీన్లు

- మల్టీకలర్ ప్రింటింగ్ ఈ క్లస్టర్ ప్రత్యేకత. జపాన్‌లో తయారైన ప్రింటింగ్, ఫోల్డింగ్, స్టేషనరీ, బైండింగ్, గమ్మింగ్, సీటీపీ, కటింగ్ తదితర 12 రకాల భారీ మెషీన్లు ఈ క్లస్టర్‌కు వచ్చేశాయి.
- జపాన్‌లో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎల్-37 అనే మెషీన్ కూడా ఈ క్లస్టర్‌కు చేరుకుంది. ఈ మెషీన్‌తో ఏకకాలంలో డబుల్ డమ్మీలు రూపొందించవచ్చు. కాకినాడ క్లస్టర్‌లో తప్ప రాష్ట్రంలో మరెక్కడా ప్రస్తుతం ఈ మెషీన్ అందుబాటులో లేకపోవడం విశేషం.
- వెబ్ మెషీన్లు కూడా ఈ క్లస్టర్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఒకేసారి లక్ష ఏ4 బ్లాక్ అండ్ వైట్ కాపీలు తీయడం ఈ వెబ్ మెషీన్ ప్రత్యేకత. 4 వేల ఏ4 షీట్లతో ప్లేట్ ప్రింటింగ్‌కు విజయవాడలో రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ వ్యయం అవుతూంటే అదే కాకినాడ క్లస్టర్‌లో రూ.1600 మాత్రమే అవుతుంది.

వ్యయప్రయాసలు తప్పుతాయి



రాష్ట్రంలో మరెక్కడా లేని సాంకేతిక పరిజ్ఞానంతో మల్టీకలర్ ప్రింటింగ్ ఇక్కడ అందుబాటులోకి రావడం చాలా గొప్ప విషయం. ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొని విజయవాడ వెళ్లాల్సిన అవసరం కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్ ఏర్పాటుతో తప్పుతుంది. విజయవాడ వెళ్తే ఒక రోజు వృథాగా పోయేది. దాదాపు అన్ని మెషీన్లూ వచ్చేశాయి. ఒకే ఒక్క మెషీన్ జపాన్ నుంచి రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం రెండో విడత నిధులు విడుదల చేస్తుందని ఎదురు చూస్తున్నాం. ఈ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్‌తో ఉత్తమమైన సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తొలి నుంచీ ఎంతో ప్రోత్సహించి, రాయితీ కూడా మొదట్లోనే విడుదల చేసింది.

– బాలప్రసాద్, ఎండీ, సత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్, కాకినాడ

భవిష్యత్ అంతా పారిశ్రామిక క్లస్టర్లదే..



భవిష్యత్ అంతా క్లస్టర్లదే. చిన్నచిన్న పారిశ్రామికవేత్తలు ఒకేచోట కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సేవలందుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ తొలి నుంచీ ప్రోత్సాహాన్ని అందించడంతో ప్రింటింగ్ క్లస్టర్ దాదాపు సిద్ధమైంది.

– టి.మురళి, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం

పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలి

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్



సభలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్

అమలాపురం టౌన్: పుస్తక పఠనంపై నేటి విద్యార్థులు మరింతగా ఆసక్తి పెంచుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్వీ ప్రసాద్ అన్నారు. దీనికోసం ప్రతి విద్యార్థీ తమకు అందుబాటులో గ్రంథాలయాలను విధిగా వినియోగించుకోవాలని సూచించారు. ఖాళీ దొరికినపుడు పుస్తకాలు చదివేందుకు సమయం కేటాయించాలని అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం అమలాపురంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గదుల్లో నాలుగు గోడల మధ్య కూర్చుని సముపార్జించే విజ్ఞానానికి సార్థకత రావాలంటే పుసక్త పఠనం అలవర్చుకోవాలని ప్రసాద్ అన్నారు. కాలం ఎంతటి ఆధునికత దిశగా వెళ్తున్నా.. గ్రంథాలయాల విలువ శాశ్వతమైనదని అన్నారు. అనంతరం దేశ తొలి మహిళా ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి, మహిళా సాధికారతపై జరిగిన సభలో ప్రసాద్ ప్రసంగించారు. సమాజంలో మహిళలు సాధిస్తున్న విజయాల పరంపరను వివరించారు. గ్రంథాలయాధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సాయి సంజీవిని మహిళా వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, సామాజిక కార్యకర్త మెహబూబ్ షకీలా తదితరులు కూడా ప్రసంగించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అంతర్వేదిలో స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



అయినవిల్లిలో ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తిక మాసంలో ఆదివారం సెలవు కావడంతో స్వామి దర్శనానికి పలువురు పిల్లాపాపలతో వచ్చారు. ఆలయంలో నిర్వహించే సుదర్శన హోమంలోనూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 7 వేల మంది స్వామివారి ప్రసాదం స్వీకరించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు ఆయన తగిన చర్యలు చేపట్టారు. అలాగే, భక్తుల తాగునీటి వసతికి కూడా దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

అయినవిల్లి గణపతి దర్శనానికి భక్తుల బారులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ నిర్వహించారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 146 మంది భక్త దంపతులు, స్వామి వారి ప్రత్యేక దర్శనంలో 1,010 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 38 మంది పాల్గొన్నారు. నూతన వాహనాలకు 29 మంది పూజలు చేయించుకున్నారు. చిన్నారులకు నామకరణాలు, అక్షరాభ్యాలు, తులాభారం వంటి ప్రత్యేక కార్యక్రమాలను 30 మంది నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,56,591 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ వంగా గీత
- 23న ప్రత్తిపాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



బస్సు యాత్ర నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత, డీఎస్పీ లతాకుమారి తదితరులు

ప్రత్తిపాడు రూరల్: పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్‌తో కలిసి ధర్మవరంలో ఆదివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 23న ప్రత్తిపాడులో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బస్సు యాత్ర ద్వారా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరిస్తామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ దేశంలో ఏ పార్టీ, ఏ నాయకుడూ చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశారు. జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరిందని ఎంపీ గీత చెప్పారు.

ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మరోసారి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, సొసైటీ ఛైర్మన్ గొంతిన సురేష్, పార్టీ శంఖవరం మండల కన్వీనర్ నరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యాత్రా స్థలం పరిశీలన

ప్రత్తిపాడు: ఈ నెల 23న ప్రత్తిపాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ నిర్వహించేందుకు అనువైన స్థలాన్ని ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్ పరిశీలించారు. దీనికి స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ అనువుగా ఉంటుందని గుర్తించారు. అక్కడి నుంచి పెద్దాపురం డీఎస్పీ లతాకుమారితో కలిసి మెయిన్ రోడ్డు వెంబడి జాతీయ రహదారిపై ఉన్న పుత్ర చెరువు జంక్షన్ వరకూ కాలినడకన ఎమ్మెల్యే పర్యటించారు. మంత్రుల బస్సు యాత్రకు వచ్చే నాయకులు, కార్యకర్తల వాహనాల రాకపోకలకు వీలుగా మార్గాలను, సభాస్థలిని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శేరు కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ళ జయశేఖర్, లంపకలోవ సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీపీఠం.. భక్తజనసంద్రం



లలితా కుంకుమార్చనల్లో వేలాదిగా పాల్గొన్న భక్తులు



శ్రీపీఠంలో దీపోత్సవ కాంతులు



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: మహాశక్తియాగం జరుగుతున్న కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం భక్తజనసంద్రంగా మారుతోంది. ఈ మహాయాగానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ పర్యవేక్షణలో ఈ యాగం ఈ నెల 14న ప్రారంభమైన విషయం తెలిసిందే. యాగంలో భాగంగా అష్టాదశ శక్తి పీఠాల్లో కొలువై ఉన్న ఆదిపరాశక్తిని ఒకేచోట మహాశక్తిగా ఆవిష్కరించే అద్భుత ఘట్టంగా శతకోటి లలితా కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. రోజూ 10 వేల నుంచి 12 వేల మందితో నెల రోజుల పాటు కుంకుమార్చనలు నిర్వహించాలని తలపెట్టారు. అయితే 15 వేలకు మందికి పైగా మహిళలు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. యాగం ఆరో రోజైన ఆదివారం యాగశాలలో ఉదయం నక్షత్ర పూజ, తిథి దేవత పూజ నిర్వహించారు. అనంతరం జరిగిన లలితా కుంకుమార్చనలకు పెద్ద సంఖ్యలో మహిళలతో పాటు పురుషులు కూడా హాజరయ్యారు. మూడుసార్లు లలితా నామార్చనలతో కుంకుమార్చనలు చేశారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. దీనికోసం వలంటీర్లు శ్రమిస్తున్నారు. దీపోత్సవ వేదికపై సాయంత్రం శోభారాజ్ బృందం ఆలపించిన కర్ణాటక సంగీతం శ్రోతలను అలరించింది. పార్వతీ పరమేశ్వరులను పల్లకీ సేవతో ఊరేగింపుగా దీపోత్సవ వేదిక వద్దకు తీసుకువచ్చిన అనంతరం పరిపూర్ణానంద స్వామి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భక్తుల చేతులు మీదుగా దీపోత్సవం చేశారు. దీపకాంతులతో శ్రీపీఠం వెనుక ఉన్న గోశాల ప్రాంగణం వెలుగులతో నిండిపోయింది.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు



వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు

- ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ
- ఎస్‌జీఎఫ్‌ఐ లాన్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభం



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17, 19 ఆధ్వర్యాన జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల లాన్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడల్లో రాణించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యాన అండర్-19 జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు కాకినాడలో జరగనున్నాయని తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, అండర్-14, 17 లాన్ టెన్నిస్ పోటీలు క్రీడా మైదానంలోని టెన్నిస్ కోర్టుల్లోను, అండర్-19 పోటీలు రాజేష్ టెన్నిస్ అకాడమీ ప్రాంగణంలోని టెన్నిస్ కోర్టుల్లోను జరుగుతాయని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి పద్మశ్రీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీలకు 12 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్, ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ భామిరెడ్డి, ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి కుమార్, హెచ్ఎం రంగారావు, పీడీలు రవిరాజు, బంగార్రాజు, శ్రీహరిరాజు, రాష్ట్ర పరిశీలకుడు బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- 60 వేల మందికి పైగా రాక
- 5,200 వ్రతాలు, రూ.60 లక్షల ఆదాయం

అన్నవరం: కార్తిక మాస తొలి ఆదివారం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని సన్నిధికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆదివారం సెలవుదినం కావడం, ఉదయం 7–30 గంటల నుంచి సప్తమి పర్వదినం రావడంతో ఈ రద్దీ ఏర్పడింది. భక్తుల రాకతో దేవస్థానం ఘాట్‌రోడ్లు, పార్కింగ్ ప్రదేశాలు కిక్కిరిసి ట్రాఫిక్ స్తంభించింది. సత్యదేవుని ఆలయం, వ్రత మండపాలు, ఆలయ ప్రాంగణం, ఎక్కడ చూసినా భక్తజనమే దర్శనమిచ్చారు. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు.

సత్యదేవుని వ్రతాలు సాయంత్రం ఐదు గంటల సమయానికి సుమారు 5,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికార్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ దేవస్థానంలో పలు విభాగాలు సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ టీవీలలో భక్తుల రద్దీ దృశ్యాలను పరిశీలించిన ఈఓ సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చారు.



నిత్యకల్యాణ మండపంలో స్వామివారి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

తెల్లవారుజాము నుంచి వ్రతాలు, దర్శనాలు

శనివారం రాత్రికే సుమారు పది వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకోవడంతో ఆలయాన్ని ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తెరిచి వ్రతాలు ప్రారంభించారు. సాయంత్రం ఆరు గంటల వరకు రద్దీ కొనసాగింది. వ్రతాలకు మండపాలు సరిపోకపోవడంతో పాత కల్యాణ మండపంలోనూ వ్రతాలు నిర్వహించారు. భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు.

సుమారు పది వేల మంది భక్తులకు పులిహోర దధ్యోజనం పంపిణీ చేశారు. సుమారు 60 వేల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. వ్రతాల ద్వారా రూ.30 లక్షలు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.12 లక్షలు ఆదాయం రాగా, మిగిలిన విభాగాల ద్వారా రూ.20 లక్షల ఆదాయం వచ్చిందని అంచనా వేశారు.

నేడు కూడా తీవ్ర రద్దీ!

కార్తిక సోమవారం పర్వదినం సందర్భంగా రత్నగిరిపై తీవ్ర రద్దీ నెల కొనే అవకాశం ఉంది. సుమారు 80 వేల మందికి పైగా భక్తులు స్వామివారి ఆలయానికి వచ్చే అవకాశం ఉంది. దీంతో తెల్లవారుజామున ఒంటి గంటకే స్వామివారి వ్రతాలు ప్రారంభిస్తారు. స్వామివారి దర్శనాలు తెల్లవారుజామున మూడు గంటల నుంచి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

క్యూ లైన్లు కంపార్ట్‌మెంట్లలో తొక్కిసలాట

నూతనంగా నిర్మించిన క్యూ లైన్ కంపార్ట్‌మెంట్లలో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వాటిలో మంచినీటితో సహా సరైన వసతులు లేకపోవడం, ఎక్కువ సేపు వేచి ఉండాల్సి రావడంతో భక్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేవస్థానం అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు ఈ పరిస్థితి నెలకొంది. దీంతో అంతరాలయ దర్శనాన్ని కొంత సేపు నిలిపి వేసి భక్తులకు బయట నుంచే దర్శనానికి అనుమతించారు.